



ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్
నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364



మర్యాదపూర్వక కలయిక

సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ అర్వింద్‌కుమార్ ద్వివేదీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసిన కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



అన్నదాన కార్యక్రమంలో జంపన ప్రతాప్

దేవాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

బోయినపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ సహాయక సహకారాలు అందించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. బోయినపల్లి బాపూజీనగర్ నల్ల పోచమ్మ ఆలయంలో సోమవారం లయన్స్ క్లబ్ ప్రతినిధి పృథ్వీనాథ్ సతీమణి స్వర్గీయ సుమిత్ర జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు జంపన ప్రతాప్ హాజరై అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జంపన మాట్లాడుతూ పేదలకు ఒక పూట భోజనం అందించేందుకు దాతలు ముందుకు వచ్చి వారి కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని కోరారు. పుట్టిన రోజుల డబ్బుల వృధా చేయకుండా ఆలయాలను వద్ద అన్నదానం చేస్తే నిరుపేదల ఆకలి తీర్చిన వాళ్ళమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్ కుమార్, అనిత, శ్యామ్ సుందర్, ఆలయ కమిటీ సభ్యులు రామారావు, పుట్టి నర్సింహ్మా, ప్రేమ్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, మారుతీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దీపాలు వెలిగిస్తున్న ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి

ఘనంగా కార్తీకమాస పూజలు

సికింద్రాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో సోమవారం కార్తీకమాస పూజలు ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్‌తోపాటు నగరం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి పూజలు జరిపారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఆలయం తరఫున ఆకాశదీపం వాయనాలను అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి తదితర సిబ్బంది సైతం కార్తీక దీపాలు వెలిగించి పూజలు జరిపారు.

అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

తిరుమలగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా తిరుమలగిరి లేక్ ప్రాంతంలోని కట్టమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, దీపాలు వెలిగించి, హారతులు అందజేసి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. కమిటీ సభ్యులు అధ్యక్షులు మురళీధర్, ప్రధాన కార్యదర్శి రాజా రెడ్డి, కోశాధికారి ఉమేష్ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

బౌద్ధనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేబుల్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యానగర్ ఏఈ రోచిత తెలిపారు. బౌద్ధనగర్ పార్కు, కనకదుర్గ ఆలయం వారాసిగూడ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, వారాసిగూడ కౌసర్ మసీదు, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.





పిచ్చి మొక్కల నడుమ ఆట పరికరాలు

అధ్వానంగా చిల్డ్రన్ పార్క్

అందుబాటులోకి తేవాలని స్థానికుల డిమాండ్

మారేడుపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మోండా మార్కెట్ డివిజన్ పరిధిలోని వెస్ట్ మారేడ్‌పల్లి నెహ్రూనగర్ ఆవరణలోని చిల్డ్రన్స్ పార్క్ పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారింది. పరిసర ప్రాంతాలకు చెందిన కాలనీవాసులు, చిన్నారులు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఉన్నప్పటికీ పార్కు ఎందుకు పని రాకుండా పోయింది. ప్రస్తుతం పోకిరీలకు అడ్డాగా మారింది. రెండు సంవత్సరాలుగా చిల్డ్రన్స్ పార్క్ అందుబాటులోకి రాకపోవడంతో పిల్లలు ఆడుకోవడానికి ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఒకవేళ పిల్లలను పార్కుకి తీసుకువచ్చినా అక్కడి పిచ్చి మొక్కలు, అపరిశుభ్రతను చూసి తిరిగి వెనక్కి వెళ్లిపోవడం గమనార్హం. గతంలో పార్కులో ఏర్పాటు చేసిన ఆట పరికరాలు సైతం వంగి తుప్పుపట్టిశిథిలావస్థకు చేరాయి.చిల్డ్రన్ పార్క్‌ను అన్ని హంగులతో అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక మారేడుపల్లి నెహ్రూనగర్ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి చేయాలి



చిన్నారుల ఆటవిడుపు కోసమైనా పార్కును అభివృద్ధి చేయాలి. తుప్పు పట్టిన ఆట పరికరాలను తొలగించి నూతన ఆట పరికరాలను ఏర్పాటు చేయాలి. పార్కు స్థలాన్ని పునరుద్ధరించి, గ్రీనరీని ఏర్పాటు చేసి వెంటనే స్థానిక వాసులకు అందుబాటులోకి తీసుకురావాలి.

- బి. వెంకట్రావు, మారేడుపల్లి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పోలీసులు జవాబుదారీతనంతో పనిచేయాలి : డీసీపీ

బోయినపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర విచారణతో నేరస్తులకు కోర్టుల్లో శిక్ష పడేలా పోలీసులు, అధికారులు బాధ్యతగా పని చేయాలని, విధి నిర్వహణలో జవాబుదారీతనం, సమర్థవంతమైన పోలీసింగ్ ద్వారా ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌లో నార్త్‌జోన్ పరిధిలోని డీసీపీ, ఏసీపీలు, సీఐ, పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓలతో అండర్ ఇన్వెస్టింగ్ కేసులు, గ్రేవ్ అండర్ ఇన్వెస్టింగ్ లాంగ్ పెండింగ్‌లో కేసుల పరిష్కారం, ఎస్సీ ఎస్టీ, ఉమెన్ ఎగ్రెనెస్ట్, పోక్సో కేసుల పరిష్కారం, ఎన్‌డీపీఎస్ యాక్ట్, ఎస్‌హెచ్ఆర్సీ, మహిళా కమిషన్‌కు సంబంధించిన అప్పీల్ పిటిషన్ పెండింగ్‌ల పై నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌లు నిర్దేశించిన దార్శనికత లక్ష్యాలను సిబ్బంది బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. పౌరుల ఫిర్యాదులకు సత్వర స్పందన కల్పించాలని, రాత్రి వేళల్లో గస్తీ విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. అన్ని విభాగాల్లో మహిళల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మాదక ద్రవ్యాల వ్యతిరేక అమలు కార్యకలాపాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సహకార, పారదర్శక పోలీసింగ్‌ను ప్రోత్సహించడానికి పౌర స్వచ్ఛంద సేవకులతో భాగస్వామ్యాలను బలోపేతం చేయాలని డీసీపీ అధికారులను కోరారు. నగరంలో ఈ సమావేశంలో గోపాల్‌పురం, బేగంపేట, తిరుమలగిరి డివిజన్ల అదనపు డీసీపీ, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

యాదవులు హక్కులను సాధించుకోవాలి

ముషీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాదవులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని రాష్ట్ర యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ అన్నారు. సోమవారం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదరు వేడుకల విజయోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న యాదవులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహకారం అందించాలని, సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు, యాదవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

15న కామారెడ్డిలో బీసీ ఆక్రోశ సభ

ముషీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునేందుకు ఈ నెల 15న కామారెడ్డిలోని సత్యాకన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే బీసీ ఆక్రోశ బహిరంగ సభను విజయవంతం చేయాలని ధర్మసమాజ్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు జి. సంతోష్‌కుమార్ కోరారు. సోమవారం ముషీరాబాద్‌లోని ధర్మసమాజ్ పార్టీ కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు అమలయ్యేలా బీసీ ఎంపీలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు బీసీ కులసంఘాల నాయకులు శ్రీనివాస్ గౌడ్, సాయియాదవ్, సాయి కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

లష్కర్‌లో పోలీసుల తనిఖీలు

అడ్డగుట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో కారులో పేలిన బాంబు నేపథ్యంలో నార్త్‌జోన్ గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య ఆధ్వర్యంలో గోపాలపురం, మారేడుపల్లి, తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్ల వద్ద కారులు, బైకులను పోలీసులు తనిఖీలు చేశారు. తెల్లవారుఝామున వరకు తనిఖీలు చేస్తున్నామని ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు తెలిపారు.



సికింద్రాబాద్ ఘన్‌రాక్‌లో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు



మారేడుపల్లిలో కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉచిత వైద్య శిబిరం

కుషాయిగూడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేజ్-5లోని హైటెక్ హైడ్రాలిక్ ఇంజనీర్స్ కంపెనీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరిసర కంపెనీలకు చెందిన కార్మికులకు సైతం నేత్ర, దంత పరీక్షలు చేశారు. కంపెనీ ఎండీ జె.రోషిరెడ్డి నిర్వాహకులను అభినందిస్తూ కార్మికులు, వారి కుటుంబాల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ ఆప్టోమెట్రిస్ట్ అనిల్ కుమార్, దమ్మాయిగూడ పద్మ సాయి డెంటల్ క్లినిక్ వైద్యుడు డాక్టర్ దినేష్ కుమార్ తదితర వైద్య బృందం తమ సేవలనందించింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చనుమోలు వరప్రసాద్, జి.వి.రావు, వేదిక అధ్యక్షురాలు శ్రీదేవి, క్యాంపు కో-ఆర్డినేటర్ సునీల్ కుమార్, సీఐటీయూ నాయకుడు జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అందెశ్రీకి ఘన నివాళి



అందెశ్రీ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి

తార్నాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ(64) సోమవారం ఉదయం లాలాపేట్‌లోని తన నివాసంలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలిపోగా, ఆయన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించినప్పటికీ మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. అందెశ్రీ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర వేదనతో రోదిస్తున్న దృశ్యాలు అందరిని కంటతడి పెట్టించాయి.

అందెశ్రీ ఆకస్మిక మృతితో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్, తలసాని శ్రీనివాస్ యాదవ్, బీజేపీ ఉపాధ్యక్షురాలు బండ కార్తీకా రెడ్డితో పాటు, వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు, కవులు, కళాకారులు, హాజరై అందెశ్రీ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందెశ్రీ పార్థీదేహాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం లాలాపేట్‌లోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో ఉంచారు. ఆయన అంత్యక్రియలను మంగళవారం మధ్యాహ్నం ఘటకేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అధికారికంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి

తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తూ జయ జయ హే తెలంగాణ గీతం ద్వారా అందెశ్రీ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన మరణ వార్త తీవ్ర విచారాన్ని కలిగించింది. ఆయన మరణం కుటుంబ సభ్యులకు, అభిమానులకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా భగవంతున్ని ప్రార్థిస్తున్నా.

- మోతె శ్రీలతశోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్

క్రైమ్ సమాచారం

గుర్తుతెలియని ప్రయాణికుడి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో అనారోగ్యంతో ఓ గుర్తుతెలియని వృద్ధుడు మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నంబరు-2లో గుర్తుతెలియని 60 ఏళ్ల ప్రయాణికుడు అనారోగ్యంతో మరణించడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గాంధీలో రోగి సహాయకురాలి అదృశ్యం



రేణుక

బౌద్ధనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోగి సహాయకురాలు అదృశ్యమైన ఘటన గాంధీ ఆస్పత్రిలో చోటు చేసుకుందని చిలకలగూడ పోలీసులు తెలిపారు. సిద్దిపేట భూంపల్లి తాళ్లపల్లికి చెందిన రాజలింగం, రేణుక దంపతులు. రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైన రాజలింగాన్ని 3న వైద్య పరీక్షల నిమిత్తం అతడి భార్య గాంధీ ఆస్పత్రిలో చేర్పించింది. రాజలింగం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో భార్య రేణుక(42) మనస్థాపానికి గురైంది. 8న రాత్రి బయటికి వెళ్లిన రేణుక తిరిగి ఆస్పత్రిలో ఉన్న భర్త దగ్గరికి రాలేదు. ఆమె కోసం పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. రాజలింగం బంధువు పవన్ కుమార్ వెంటనే చిలకలగూడ పోలీసులకు రేణుక అదృశ్యమైందని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం




వర్షిత

అడ్డగుట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : షాపింగ్ కోసమని బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ బోయగూడ ప్రాంతానికి చెందిన చిత్రం భాను కుమార్తె వర్షిత(22) షాపింగ్ కోసమని అక్టోబరు 21న సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాండు వరకు వెళ్లింది. ఆరోజు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేదు. ఇప్పటివరకు ఇంటికి రాకపోవడంతో 10న గోపాలపురం పోలీసులకు తల్లి భాను కూతురు మిస్సింగ్ కేసు కింద ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. గతంలో వర్షితకు పెళ్లి అయిందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

అడ్డగుట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా వెళుతున్న వ్యక్తి నుంచి సెల్‌ఫోన్‌ను దొంగిలించిన ఇద్దరు నిందితులను రాంగోపాల్‌పేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరు బాలుడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్టోబరు 27న అనోజ్ యాదవ్ అనే వ్యక్తి నడుచుకుంటూ కిమ్స్ ఆస్పత్రి వైపు వెళుతున్నాడు. ఇంతలో అతడికి ఫోన్‌కాల్ రావడంతో జేబులో నుంచి ఫోన్ తీస్తుండగా అప్పటికే గమనిస్తున్న రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన షేక్ మోహియుద్దీన్(19), మరో బాలుడు కలిసి బైకుపై వచ్చి మనోజ్ యాదవ్ సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. వెంటనే బాధితుడు రాంగోపాల్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సమాచారం అందుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దొంగిలించిన సెల్ ఐఎంఈఐ నంబరు ఆధారంగా డిటెక్టివ్ సీఐతో పాటు క్రైమ్ పోలీసులు విశ్వసనీయ సమాచారంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితుల్లో ఒకరిని జువైనల్ హోంకు తరలించారు. షేక్ మోహియుద్దిన్‌ను అరెస్టు చేసి అతడి నుంచి సెల్‌ఫోన్, బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పరిశోధనలో నాణ్యతే లక్ష్యం : ఓయూ వీసీ



మాట్లాడుతున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో నాణ్యతే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కుమార్ మొలుగరం వ్యాఖ్యానించారు. ఓయూలో పరిశోధన పద్ధతులపై పదిరోజుల ఇంటెన్సివ్ వర్క్ షాప్ సోమవారం ప్రారంభమైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజినల్ సెంటర్ సహకారంతో భూగోళశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ప్రాంతీయ పట్టణ పర్యావరణ అధ్యయన కేంద్రం (ఆర్‌సీయూఈఎస్) ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన కేవలం డిగ్రీ కోసమే కాకుండా సమాజ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ఉండాలని సూచించారు. వర్క్‌షాప్‌లో కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన 30 మంది పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూలో కొనసాగుతున్న అధ్యాపకుల నిరసన



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీఏఎస్ ప్రమోషన్లలో జరిగిన అవకతవకలపై అధ్యాపకుల నిరసనలు 40 రోజులుగా కొనసాగుతున్నాయి. ప్రతీరోజూ మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నారు. సోమవారం ఫిజిక్స్ విభాగంలో నిరసన తెలిపారు. ప్రమోషన్ల విషయంలో "కొందరిపై ఆశ్రిత పక్షపాతం, మరికొందరికి కక్ష సాధింపు" విధానాన్ని వీసీ అమలు చేశారని ఔటా నాయకులు విమర్శించారు. అడ్మినిస్ట్రేషన్ స్పందించకపోవడం, చర్చలకు పిలవకపోవడం దురదృష్టకరమని ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటదాస్, నతానియేల్, మాధురి, సుజాత, శశికళ, అపర్ణ, కామర్స్ గంగాధర్, రామచంద్రనాయక్, అరవింద్, రమేష్‌బాబు, పి.రమేష్, లోకండే సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లైబ్రరీ, పార్కు నిర్మాణానికి భూమిపూజ చేసిన కార్పొరేటర్ శ్రవణ్

లైబ్రరీ, పార్కు నిర్మాణానికి భూమిపూజ

మల్కాజిగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి మారుతీనగర్ ప్రధాన రహదారికి పక్కన గల స్థలంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న లైబ్రరీ, పార్కు నిర్మాణానికి సోమవారం కార్పొరేటర్ భూమిపూజ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి రూ.25 లక్షలు నూతనంగా భవనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కబ్జాకు గురైన ఈ స్థలాన్ని కాపాడామని అన్నారు. ఈ స్థలంలో నూతనంగా గ్రంథాలయంతో పాటు అందమైన పార్కును ఏర్పాటు చేసి ప్రజలకు అంకితం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో స్థానికులు హరిగౌడ్, జైకృష్ణ, శాస్త్రి, మహేందర్, శ్రీనివాస్, రాజేందర్, బాబు, శంకర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై రాజకీయ ప్రత్యర్థులు

- ఆప్యాయ పలకరింపులు..
- ప్రస్తుత రాజకీయాలపై చర్చ

సికింద్రాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విమర్శలు-ప్రతి విమర్శలు, ఆరోపణలు-ప్రత్యారోపణలతో నిత్యం కత్తులు దూసుకునే వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలాగే తమకు ఎదురు పడిన అధికారులు, ఉద్యోగులకు కరచాలనం చేసి, వారి యోగక్షేమాలు కనుక్కున్నారు. మరోవైపు నిత్యం దైనందిన కార్యకలాపాల్లో బిజీగా గడిపే అధికారులు, ఉద్యోగులు వాటిని కొద్దిసేపు పక్కన పెట్టి, ముఖ్యంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గురించి చర్చించుకుంటూ, తన వితీరా ఆస్వాదించారు. ఇటీవల ఢిల్లీలోని డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ కార్యాలయానికి అదనపు డైరెక్టర్ జనరల్‌గా పదోన్నతిపై బదిలీయైన సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ సోమవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన చిట్‌చాట్ కార్యక్రమంలో ఆవిష్కృతమైన సన్నివేశాలివి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓగా మూడేళ్ల పాటు తాను అందించిన సేవలు తన కెరీర్‌లోనే గుర్తుండిపోతాయని ఆయన ఈ సందర్భంగా అన్నారు. పలు సందర్భాల్లో ఒత్తిళ్లకు లోనైనప్పటికీ, కాలనీలు, బస్తీల ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచినప్పుడు పొందిన ఆనందం అంతా ఇంతా కాదని వ్యాఖ్యానించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, కాలనీల, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తన పట్ల కనబరచిన అభిమానాన్ని మరువలేనన్నారు. డిఫెన్స్ ఎస్టేట్ అధికారి దినేష్‌రెడ్డి, కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, సాద కేశవరెడ్డి, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మదమల్లికార్జున్, బీఆర్ఎస్ నాయకులు గజ్జెల నాగేష్, నివేదిత, కె.పాండుయాదవ్, నళినికిరణ్, ప్యారసాని శ్యామ్‌కుమార్, బి.అనితప్రభాకర్, టి.ఎన్.శ్రీనివాస్, ముప్పిడి గోపాల్‌లతోపాటు కంటోన్మెంట్ బోర్డులోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మధుకర్ నాయక్‌ను సత్కరిస్తున్న బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, వైస్‌చైర్మన్ డి.బి.దేవేందర్



మధుకర్ నాయక్‌ను సత్కరించిన బాణుక నర్మద మల్లిఖార్జున్



మధుకర్ నాయక్‌ను సత్కరించిన గజ్జెల నాగేష్

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | జి.అంజయ్య: 9985921364


భోజనం చేస్తున్న మహిళా సిబ్బంది


పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది


ఎన్నికల సామాగ్రి తీసుకెళ్తున్న అధికారులు


పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లల్లో అధికారులు, సిబ్బంది


ఎర్రగడ్డలోని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు

ఎర్రగడ్డ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ నేడు జరగనుంది. ఇందుకు సర్వం సిద్ధమైంది. ఎర్రగడ్డ డివిజన్‌లో 63 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో మూడు నుంచి నాలుగు బూత్‌లను ఏర్పాటు చేశారు. వీటిని అధికారులు సోమవారం పరిశీలించారు. అన్ని కేంద్రాల పోలీసులు, కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

టీవీ సీరియల్, ఓటీటీ కార్మికులకు సెలవు

బంజారాహిల్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో నేడు టీవీ సీరియల్, ఓటీటీ నిర్మాతలు కార్మికులకు సెలవు ఇస్తున్నట్టు తెలుగు టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నిర్ణయం తీసుకుంది. కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఫెడరేషన్ ప్రకటించింది.

కొనసాగుతున్న పంపిణీ

బోరబండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా బోరబండ, రహ్మత్ నగర్ డివిజన్ల పరిధిలో ఓటర్లకు నగదు, కానుకల పంపిణీ కొనసాగుతోంది. గల్లీగల్లీలో ఉన్న ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఓటరు స్లిప్పులు, ఆధార్‌కార్డులతో వచ్చిన వారు అసలైన ఓటర్లని నిర్ధారించుకున్న తర్వాత, కచ్చితంగా తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని హామీ తీసుకుని నగదు, కానుకలు అందజేస్తున్నారు. ఓటర్లకు ఫోన్లు చేసి పిలిపించి మరీ అందిస్తున్నారు.


మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్‌ను అభినందిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి


రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌ను బోరబండ సైట్-1 అక్బరీ మసీదు కమిటీ ప్రతినిధులు ఆయన నివాసంలో సత్కరించారు. మైనార్టీల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మసీదు కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.ఎ.సత్తార్, కార్యదర్శి మహ్మద్ జహంగీర్, కమిటీ సభ్యులు అబ్దుల్ ఖదీర్ సిద్ధిఖీ, షేక్ షఫియుద్దీన్, మహ్మద్ ఇషాక్ అహ్మద్, మహ్మద్ ఆరీఫ్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు
- బోరబండ, ఆంధ్రజ్యోతి


మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మహ్మద్ అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా.గంటా మల్లేష్, గంటా శ్రీనివాస్ తదితరులు
- బోరబండ, ఆంధ్రజ్యోతి


పోటీల్లోని దృశ్యం

ఉత్సాహంగా పికిల్‌బాల్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ పికిల్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సోమవారం మాదాపూర్‌లో రిజర్వ్ స్పోర్ట్స్ ఎరీనాలో రసవత్తరంగా జరిగిన ప్లేఆఫ్స్ పోటీలను వీక్షించేందుకు మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, బ్యాడ్మింటన్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి విచ్చేశారు. లీగ్ దశ ఆఖరి మ్యాచ్‌ల్లో క్రెడికాన్ టైటాన్స్, ఆల్ స్టార్స్, డైనమోస్, రాప్టర్స్ జట్లు విజయం సాధించి, ప్లేఆఫ్స్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నాయి. వచ్చే నెల 13న ఫైనల్ జరగనుంది.

నిమ్స్ ఉద్యోగుల నిరసన

నిమ్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని నిమ్స్ టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. ప్రమోషన్లు ఇవ్వడం లేదని, బ్యాక్ డోర్ ఎంట్రీలపై విచారణ చేయాలని, రేడియాలజీ ఉద్యోగి సురేంద్ర సింగ్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారంతా డైరెక్టర్ కార్యాలయం ముందు భైఠాయించి నిరసన తెలిపారు.

ధ్వజస్తంభం ప్రతిష్టాపన

పంజాగుట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ డివిజన్ చింతల్ బస్తీలోని శ్రీ బోలా శంకర్ భక్త సమాజ్ మండలి వారి ఆధ్వర్యంలో ఉమా నాగలింగేశ్వర దేవస్థానం జీర్ణోదరణ(శివలింగ నంది) ధ్వజస్తంభం ప్రతిష్టాపన ప్రత్యేక పూజల మధ్య సోమవారం జరిగింది. స్థానిక కార్పొరేటర్ పి.విజయారెడ్డి హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ బోలా శంకర్ భక్త సమాజ్ సభ్యులతోపాటు బస్తీ వాసులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి


కార్తీక సోమవారం సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా మిఠాయిలతో అలంకరణ
- బేగంపేట, ఆంధ్రజ్యోతి


శ్యామలకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న డా.సీపీ యాదవ్ తదితరులు

బేగంపేట ట్రాఫిక్ ఏఎస్ఐకి డాక్టరేట్

బేగంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బేగంపేట ట్రాఫిక్ ఏఎస్ఐ వి.శ్యామలకు మ్యాజిక్ ఆర్ట్స్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆదివారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ డా. సీపీ యాదవ్, అమెరికన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి డా. రాజేంద్ర సాయి తదితరులు శ్యామలను సన్మానించి డాక్టరేట్ పట్టాను అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు అథ్లెటిక్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలను సాధించడం వంటి విభిన్న అంశాల్లో ప్రతిభ చూపుతున్నందుకు శ్యామలకు డాక్టరేట్ రావడంపై ట్రాఫిక్ అధికారులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు.





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364